క్లుప్తంగా

'దళిత బంధు' దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



లబ్ధిదారునికి కారు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: దళితబంధు పథకం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దళిత బంధు పథకం కింద అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లిపూర్ గ్రామానికి చెందిన తుమ్మల ధన్‌రాజ్‌కు మంజూరైన కారును గురువారం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. దళితుల ఆర్థిక ప్రగతికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని దళితులు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు.

ఘనంగా అయ్యప్ప పూడిపూజ



పడిపూజకు హాజరైన భక్తులు

యాచారం: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఇరుముడి పూజ గురువారం ఘనంగా జరిగింది. చందర్‌నాయర్, నారాయణశెట్టి గురుస్వామి పర్యవేక్షణలో దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా ఆధ్వర్యంలో జరిగిన ఇరుముడి పడిపూజకు మాజీ మంత్రి బాబు మోహన్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎంపీపీ కొప్పు సుకన్య, యాచారం సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులై గురువారం బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు గౌడ్‌ను గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బబ్బూరి దేవేందర్‌గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందుల బాల్‌రాజ్‌గౌడ్, డొంకని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపసర్పంచ్ తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌లో గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముద్రించిన 2023వ నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను ఉప సర్పంచ్ ఎన్నం మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల చారిటబుల్ ట్రస్టు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిరుపేదలకు చేయూతనందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదయ్య, జానయ్య, మల్లేష్, రవీందర్‌రెడ్డి, నరసింహ, వెంకటేష్, శ్రీకాంత్, బాలకృష్ణ, చందు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారానికి భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాదారం వేణుగోపాలస్వామి ఆలయం ముఖద్వార నిర్మాణ పనులకు గురువారం మక్తమాదారం గేట్ వద్ద దాతతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు, అర్చకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖద్వార నిర్మాణ దాత రాములను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సులోచన సాయిలు, హరిచంద్ నాయక్, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ డైరెక్టర్ నర్సింహగౌడ్, అర్చకులు విజమూరి రామనుజాచార్యులు, నాయకులు బాల్‌రాజ్, యాదగిరి, శ్రీనివాస్, సత్యం, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నాలుగేళ్ల నిరీక్షణకు తెర

- వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం
- చైర్మన్‌గా చంద్రయ్య, వైస్ చైర్మన్‌గా రవీందర్‌రెడ్డి
- రైతులకు అందనున్న మెరుగైన సేవలు



చంద్రయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్



రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: నాలుగేళ్ల సుదీర్ఘ విరామానికి తెరపడింది. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సిఫార్సు మేరకు మంచాల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన ఏర్పుల చంద్రయ్య వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, కొంగరకలాన్ గ్రామానికి చెందిన కల్వకోలు రవీందర్‌రెడ్డిని వైస్ చైర్మన్‌గా నియమించారు. సభ్యులుగా పాశం రవీందర్‌గౌడ్, బుట్టి రాములు, మొగిలి పావని, తలారి మల్లేష్, నేనావత్ శంకర్, నారి యాదయ్య, ఎండీ జానీపాష, మంగ వెంకటేశ్, ఆడాల గణేశ్, కాయితి వెంకట్‌రెడ్డి, మిర్యాణం కిరణ్‌కుమార్, ఎర్రమల్ల శ్రీనివాస్‌ను నియమించారు. వీరితోపాటు ఆర్‌కే మైలారం(దండుమైలారం) పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ), ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సభ్యులుగా కొనసాగుతారు.

ముందే చెప్పిన సాక్షి..

ప్రత్యేక రాష్ట్రం ఎర్పడిన అనంతరం 2016 మేలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమించారు. 2018 వరకు ఈ కమిటీ కొనసాగింది. అప్పటి నుంచి నాలుగేండ్ల పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో ×ఈ ఏడాదైనా మోక్షం కలిగేనా?≀ అనే శీర్షికతో నాలుగేళ్లుగా మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఖాళీ అనే వార్త బుధవారం, గత నెలలో ఏర్పుల చంద్రయ్యకే మార్కెట్ కమిటీ చైర్మన్ ఖరారు అనే కథనాలు ×సాక్షి≀ దినపత్రికలో ప్రచురితమైయ్యాయి. సాక్షిలో ముందే చెప్పినట్లుగానే చంద్రయ్యకే చైర్మన్ పదవి రాగా.... ×ఈ ఏడాదైనా మోక్షం కలిగేనా≀ వచ్చిన తాజా వార్తతో బీఆర్ఎస్ అధిష్టానం స్పందించింది. వెంటనే అధికారికంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గం ఏర్పాటుతో ఈ అంశానికి తెర పడింది. అయితే ఆయా పదవులు రాక నిరాశకు గురైన వారిని బుజ్జగించేపనిలో పార్టీ అధిష్టానం పడింది.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ వారికి అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిరుద్యోగ యువత–ఐక్యత భరోసా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువకులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను, శిక్షణ నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను గురించి చర్చించారు. నిరుద్యోగులకు భవిష్యత్తులో అండగా ఉంటామని వారిలో భరోసా కల్పించారు. యువకులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, స్థానిక నాయకులు యాదగిరి, రాఘవేందర్, వరప్రసాద్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు

ఐదు టిప్పర్లు, రెండు జేసీబీల సీజ్



గౌరెల్లిలో చేపట్టిన తవ్వకాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గౌరెల్లిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఐదు టిప్పర్లు, రెండు జేసీబీలను సీజ్ చేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 238లో గల ప్రభుత్వ భూమిలో రెండు, మూడు రోజులుగా అర్ధ రాత్రి సమయంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మట్టి తవ్వకాలు చేపడుతున్న పలువురిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో మట్టి తవ్వకాలు చేపడితే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ అనితారెడ్డి హెచ్చరించారు. కాగా, ప్రభుత్వ భూమిలో నుంచి మట్టిని స్థానిక ఎంపీటీసీ బాల లింగస్వామి అక్రమంగా తవ్వకాలు చేపట్టిన తన సొంత భూమిలో పోసుకుంటుండటంతో పాటు ఇతరులకు విక్రయిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గీత



వైద్య సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.గీత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని గురువారం కందుకూరు డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.గీత సందర్శించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి ఇటీవల ఇద్దరు వైద్యులు నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిని సందర్శించిన డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ.. డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైనసేవలు అందించాలని సూచించారు. అంతకుముందు కామారెడ్డి ప్రభుత్వాస్పత్రి సివిల్ సర్జన్ రవీంద్రమోహన్ సందర్శించి ప్రభుత్వాస్పత్రికి అవసరమైన వసతుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్, డాక్టర్లు మంజుల, మైమునాబేగం, జయశ్రీ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- న్యూమధురానగర్ కాలనీవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: 'మా కాలనీని అన్నివిధాల అభివృద్ధి చేయండి. డ్రైనేజీ, రోడ్లుతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలి' అంటూ అల్మాస్‌గూడ న్యూమధురానగర్ కాలనీవాసులు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఇప్పటివరకు రోడ్లు, డ్రైనేజీలు వేయలేదని, మధురానగర్ కాలనీ నుంచి విడిపోయి, కొత్తగా సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే, కావాలనే న్యూమధురానగర్ పేరును మార్చి ఇంద్రహిల్స్ సంక్షేమసంఘం అని పేరు పెట్టారంటూ స్థానిక ప్రజాప్రతినిధులను విమర్శించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కాలనీలన్నీ సమానమే..

ఇంద్రహిల్స్ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ వేయాలని మంత్రి సబితారెడ్డి సంతకం(ఎండర్స్) చేసి బడంగ్‌పేట కార్పొరేషన్‌కు పంపారని 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక చెప్పారు. వీధికో పేరు పెట్టుకుంటున్నారు. అది వాళ్లిష్టం. ఈ విషయంలో మంత్రి, కార్పొరేటర్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆమె తెలిపారు. అభివృద్ధి అనేది రాత్రికిరాత్రి జరిగేది కాదని, దశలవారీగా జరుగుతుందన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు సమానమేనని, కాలనీల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతామని పేర్కొన్నారు.

స్థలం కబ్జా చూపాలంటూ తహసీల్దార్‌కు వినతి

కందుకూరు: మండలంలోని నేదునూరు పంచాయతీ పరిధిలోని అక్బర్‌జా రెవెన్యూ సర్వే నంబర్ 9లో గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల సర్టిఫికెట్లకు సంబంధించి స్థలాలను కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. ఆ సర్వే నంబర్‌లో 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 163 మంది పేదలకు 60 గజాల చొప్పున సర్టిఫికెట్లు అందించి, ఇంతవరకు కబ్జా చూపలేదన్నారు. ఇచ్చిన సర్టిఫికెట్లకు కబ్జా చూపాలని పలుమార్లు అధికారులకు విన్నవించామని, మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె హామీ ఇచ్చిందన్నారు. అధికారులు స్పందించి కబ్జా చూపి పేదలకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.చందు, ఎ.కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉత్సవాల సందర్భంగా ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి అలివేలు మంగ మూలవిరాట్‌లను అభిషేకించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు గూడ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రసవం అనంతరం తల్లి మృతి

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన మంగమ్మ (29) ప్రసవం అనంతరం మృతిచెందింది. స్థానికులు, బాధితుల కథనం మేరకు... ఈనెల 4న తెల్లవారుజామున మంగమ్మకు పురిటి నొప్పులు రావడంతో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకపోయారు. ఆమె ఆరోగ్యం సహకరించకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హైదరాబాద్ కోఠి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆపరేషన్ నిర్వహించారు. అక్కడ ఆడపిల్లకు జన్మనిచ్చింది. అయితే ప్రసవం అనంతరం మంగమ్మ మృతిచెందింది. ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

బీజేపీ మహేశ్వరం పాలక్ సుధాకర్‌రెడ్డి

పహాడీషరీఫ్: బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం పాలక్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు ఎం.కపిల్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీరాంకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు దిశగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

తలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన లక్ష్మీదేవికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.1,00,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు మెదక్‌పల్లిలో చెక్కు అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరణి, శివశంకర్‌రెడ్డి, జిల్లా జర్నలిస్టు నాయకుడు శంకర్, వెంకటేశ్, అశోక్, దయాకర్, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.20వేల చెక్కు అందజేత..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామానికి చెందిన బైకని అంజమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం క్రింద రూ.20వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బైకని అంజమ్మ కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్, నిట్టె నారాయణ, నాయకులు విక్రం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేసిన ఎమ్మెల్సీ..

కడ్తాల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం వరమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన గోపాల్ కిషన్‌జీకి రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్సీ నివాసంలో గురువారం బాధితుడికి చెక్కును ఎమ్మెల్సీ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్ ఉన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య
- లింగరావుపల్లిలో గ్రామ కమిటీ ఎన్నిక



గ్రామకమిటీ సభ్యులతో నాయకులు

తలకొండపల్లి: భూమిలేని దళితులందరికీ 3 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లింగరావుపల్లిలో గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఎన్నిక–దళితుల అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇండ్ల స్థలం ఉండి ఇండ్లు లేనివారికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రూ.10 లక్షల దళితబంధు మంజూరు చేయాలన్నారు. అనంతరం చెన్నయ్య సమక్షంలో గ్రామ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా కృష్ణయ్య, కార్యదర్శిగా కుమార్, ఉపాధ్యక్షులుగా శేఖర్, అశోక్, సహాయ కార్యదర్శులుగా యాదయ్య, రాములమ్మ, సలహాదారులుగా తిరుపతయ్య, చంద్రయ్య, రామచంద్రయ్య, రాములు, మరో 5 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల సమన్వయ కన్వీనర్ గుమ్మడి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మక్తాల కళావతి గురువారం మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు పరామర్శించారు. ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగిళ్ల జగన్, మహేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేలు సాయం..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యలను గురువారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఐక్యత ఫౌండేషన్ సమకూర్చిన రూ.5 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య, వెంకటయ్య, పర్వతాలు, పెద్దిరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఆధ్వర్యంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లి గ్రామానికి చెందిన బాటసింగారం సహకార సంఘం సభ్యుడు చింతకాయల చంద్రయ్య డిసెంబర్ 2న మృతి చెందడంతో మృతుడి కుటుంబానికి సహకార సంఘం తరఫున అందించే రూ.25వేల ఆర్థిక సహాయాన్ని గురువారం సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి మృతుడి కుమారుడు శివకు అందజేశారు. డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుడి కుటుంబానికి చేయూత



వెంకటేశ్‌గౌడ్ భార్యకు నగదు అందజేస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడువెంకటేశ్‌గౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి మృతిచెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబానికి కల్లుగీత కార్పొరేషన్ నుంచి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని గురువారం మృతుడి భార్య మంగమ్మకు కల్లుగీత కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సుధాకర్ గౌడ్, బీసీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ రవీందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీశైలం, ముత్యాలు, గ్రామ సొసైటీ అధ్యక్షులు బొడిగే వెంకటేష్ గౌడ్, మూల కృష్ణగౌడ్, మూల నరేష్‌గౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారాన్ని తగ్గించాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా



పన్నులపై ప్రచారం చేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లో అధిక పన్నుల భారాన్ని తగ్గించాల్సిందేనని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో ప్రజలపై అధిక పన్నుల భారం పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పన్నులను తగ్గించేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్రీనివాస్, శ్రీశైలం, వెంకటేశ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు యాదిరెడ్డి, నాయకులు.. గంగమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్, సుభాష్‌రెడ్డి, కుమార్, మధు, ఐతరాజు భాస్కర్ పాల్గొన్నారు.

బలిజ సంఘం భవన నిర్మాణానికి కృషి

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- వీరశైవ లింగాయత్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి, నాయకులు

మహేశ్వరం: వీరశైవ లింగాయత్ బలిజ సంఘం సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల వీరశైవలింగాయత్ బలిజ సంఘం అధ్యక్షుడు సలేంద్ర శివకుమార్ అధ్యక్షతన నగరంలోని మంత్రి సబితాఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సంఘం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఉన్న వీరశైవ లింగాయత్ బలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారంటే కారణం సీఎం కేసీఆర్ చలవే అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో బస్వ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి, భవనం నిర్మాణం చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ బీసీ యువతకు సబ్సిడీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండల వీరశైవ లింగాయత్ బలిజ సంఘం ప్రధాన కార్యదర్శులు సదానందం, సీనియర్ నాయకులు దుడువై శివకుమార్, సలేంద్ర శ్రీశైలం, దండు శంకరప్ప, శివకుమార్, రాజలింగం, శేఖర్, రమేష్, పరమేష్, విక్రమ్, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.